www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు: 08 వెల : రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 156 | శనివారం | 16.11.2024



## మేం అధికారంలోకి వచ్చాక
## మీ సంగతి చెబుతాం

- ఈరోజు కొడంగల్ తిరగబడ్డది..
- రేపు తెలంగాణ తిరగబడుతుంది
- ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దు
- సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారు
- కొడంగల్‌ను అల్లుడి కంపెనీకి రాసివ్వాలని సీఎం ప్రయత్నాలు చేస్తుండు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

మేం అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డిని ఏం చేయాలో తమకు తెలుసని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈరోజు కొడంగల్ తిరగబడ్డదని, రేపు తెలంగాణ తిరగబడుతుందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని ధైర్యం చెప్పారు. లగచర్ల ఘటనలో అరెస్టై.. సంగారెడ్డి జైలులో ఉన్న వారితో కేటీఆర్ శుక్రవారం ములాఖత్ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తిరుపతిరెడ్డి ఫోన్‌లో ఆదేశాలిస్తుంటే.. అధికారులు పాటిస్తున్నారన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందులా మారారని మండిపడ్డారు. గతంలో ఫార్మా కంపెనీలను విమర్శించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఫార్మా కంపెనీలు కావాలని చెప్పడమే కాకుండా వేలాది ఎకరాలు కావాలంటున్నాడని మండిపడ్డారు. లగచర్ల ఘటన సమయంలో ఓ వ్యక్తి కులగణనలో పాల్గొన్నారని, అతనిని కూడా అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు. ఓ ఐటీఐ విద్యార్థిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కలెక్టర్ లగచర్లకు

మిగతా 2లో..



## కేసీఆర్ బాటలోనే..
## రేవంత్‌రెడ్డి

ఆరు గ్యారంటీలు అమలు చేశామని సీఎం అబద్ధాలు చెబుతుండు

- కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన చర్యలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- ప్రజలకు మాటలు చెబుతూ.. మూటలు పార్టీకి ముట్టజెప్పుతున్నరు
- రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలే..
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

02

## పండిన ప్రతి గింజను కొంటాం

- సన్న వడ్లకు బోనస్ కూడా ఇస్తాం
- ఈ ఏడాది వరి సాగులో తెలంగాణే టాప్
- రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాల మాఫీపై త్వరలోనే ప్రకటన చేస్తాం
- రైతు భరోసా సబ్ కమిటీ నివేదిక రాగానే రైతులకు అందజేస్తాం
- రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



02



### ఏఐసీసీలో ఖర్గే ఓ బొమ్మ మాత్రమే..

- నాడు మన్మోహన్ సింగ్‌ను ఎలా వాడుకున్నారో.. నేడు ఖర్గేను కూడా అలాగే వాడుకుంటున్నరు
- ఎవరడ్డుకున్నా వక్ఫ్ బోర్డు సవరణ జరుగుతుంది
- శీతాకాల సమావేశంలో వక్ఫ్ బోర్డు బిల్లు పాస్ అవుతుంది
- ప్రజలను బొరంగజేబు విధానాలు ఇప్పటికీ పీడిస్తున్నాయ్
- బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

02

## సింపతీ కోసమే కేటీఆర్ అరెస్ట్ డ్రామా

ఆయనను అరెస్ట్ చేసేందుకు మేం కుట్ర చేయట్లే..

- లగచర్ల ఘటనలో కలెక్టర్‌ను చంపే కుట్ర జరిగింది
- విచారణ పూర్తయ్యాక అన్ని విషయాలు బయటకొస్తాయి
- మంత్రి శ్రీధర్‌బాబు సంచలన వ్యాఖ్యలు



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

ప్రజల్లో సానుభూతి కోసమే కేటీఆర్ పదే పదే అరెస్ట్ అంటూ మాట్లాడుతున్నారని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. లగచర్ల ఘటనలో కలెక్టర్‌ను చంపే కుట్ర జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. అలాగే, రైతుల విషయంలో ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారం ఆపాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు సచివాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. లగచర్ల ఘటనలో ఎవ్వరినీ వదిలిపెట్టం. దీనిపై విచారణ

మిగతా 2లో..



'కోటి దీపోత్సవం' వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

05

### రాజకీయ కుట్రతోనే కులగణనపై అపోహలు

సర్వే వల్ల కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన్చు తప్పుడు ప్రచారం చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటాం మంత్రి పొన్నం ప్రభాకర్



02




### ఫిలిప్పీన్స్‌లో తెలుగు యువతి మృతి

- బర్త్ డే రోజే అనుమానాస్పదస్థితిలో మెడికో మరణం

02

## నగరంలో సెమీ కండక్టర్స్ ఆర్అండ్‌డీ సెంటర్

- వచ్చే ఐదేండ్లలో 500 మందికి ఉపాధి కల్పించే లక్ష్యం..
- ఇండియాలో ఎన్నో ప్రధాన నగరాలను కాదని హైదరాబాదులో పెట్టబడులు



02



02

### 'పట్నం' కోసం రంగంలోకి బీఆర్ఎస్ లీగల్ టీమ్..

- ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని కోరుతూ పిటిషన్
- తిరస్కరించిన హైకోర్టు రిజిస్ట్రీ

## కేసీఆర్‌ను కేటీఆర్ నిర్బంధించారు

- అందుకే ఏడాదిగా బయటకు రావడం లేదు..
- లగచర్లలో భూమిలేని వారే అధికారులపై దాడి చేశారు
- కేటీఆరే ఉద్దేశపూర్వకంగా ఆ దాడి జరిపించారు
- పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



04

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# ఫిలిప్పీన్స్‌లో తెలుగు యువతి మృతి

ప్రజానావ, హైదరాబాద్:

డాక్టర్ అన్న కోరికతో విదేశాలకు వెళ్లిన 20 ఏళ్ల యువతి అనూహ్య మరణం అనేక అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణకు కెందిన స్నిగ్ధ వైద్య విద్య అభ్యసించ డానికి ఫిలిప్పీన్స్ వెళ్లింది. పుట్టినరోజు నాడే అనుమానాస్పదంగా మృతి చెందడంతో శోక సంద్రంలో మునిగిపోయింది. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో పంచాయతీ పరిధిలో నివాస ముంటున్నారు చింత అమృత్ రావు. మెదక్‌లోని ట్రాన్స్‌కో డీఈ అమృతరావు కుమార్తె స్నిగ్ధ రెండేళ్ల క్రితం ఎంబీబీఎస్ చేసేందుకు ఫిలిప్పీన్స్ వెళ్లింది. పర్పెచువల్ హెల్ప్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఏం జరిగిందో తెలియదు కానీ పుట్టిన రోజు విషెస్ చెబుతామని ఫోన్ చేస్తే అనారోగ్యానికి గురైన ఆమెను ఆసుపత్రికి తరలించే సమయానికి కన్నుమూసినట్టు తెలుస్తోంది. ఏం జరిగిందో అర్థం కావడం లేదని, తమ పాప చాలా ధైర్యవంతురాలని స్నిగ్ధ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరపాలని, తమ బిడ్డ మృతదేహాన్ని ఇంటికి చేర్చేందుకు సాయం చేయాలని కోరుతున్నారు. మరోవైపు ఫిలిప్పీన్స్‌లోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడిన అధికారులు ఆమె మృతదేహాన్ని భారత దేశానికి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. స్నిగ్ధ మరణానికి గల కారణాలపై వివరాలు తెలియాల్సి ఉంది.

# కేసీఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి

ప్రజానావ, సికింద్రాబాద్:



తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేశామని, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. సికింద్రాబాద్ టూరిజం ప్లాజాలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మాటలు ప్రజలకు.. మూటలు పార్టీకి అన్నట్లుగా.. కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. అశోక్‌నగర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంకా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించలేదు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలేదని విమర్శించారు.

**ఈ నెల 21 నుంచి 24 వరకు 'లోక్‌మంథన్'...**

శిల్పకళావేదికలో ఈనెల 21 నుంచి 24 వరకు లోక్ మంథన్ నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట పర్యాటక భవన్‌లో లోక్ మంథన్‌పై కేంద్రమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ ఏడాదిలో అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవంగా లోక్‌మంథన్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 21న స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 22న లోక్‌మంథన్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభిస్తారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా 24న జరిగే ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, విదేశీ అతిథులు హాజరుకానున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

## మేం అధికారంలోకి వచ్చాక
# మీ సంగతి చెబుతాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినప్పుడు ఆందోళనలో పాల్గొన్నవారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని తెలిపారు. లగచర్ల ఘటనలో కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారన్నారు. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలను మాత్రమే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎద్దేవా చేశారు. ఈ ఘటనకు సీఎం కావాలనే రాజకీయ రంగు పులిమారన్నారు. తన పదవి ఐదేళ్లే ఉంటుందని రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. కొడంగల్‌ను అల్లుడి ఫార్మా కంపెనీకి రాసివ్వాలని సీఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎకరం రూ.60 లక్షల భూమిని రూ.10 లక్షలకే లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పేదవాడి కన్నీళ్ల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందన్నారు. రేవంత్ రెడ్డికి చేతనైతే తమతో కొట్లాడాలి తప్ప అమాయకులతో కాదన్నారు.

# నగరంలో సెమీ కండక్టర్స్ ఆర్‌అండ్‌డీ సెంటర్

ప్రజానావ, ఖైరతాబాద్:

వందేళ్ళ చరిత్ర కలిగిన అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లోని సెమీ కండక్టర్స్ ఆర్‌అండ్‌డి సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లో అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ కొత్త ఆర్‌అండ్‌డీ సెంటర్ ప్రకటించింది. ఆటోమోటివ్ సెమీకండక్టర్స్‌లో గ్లోబల్ లీడర్, టెస్లా, టాటా వంటి అగ్ర ఈవీ బ్రాండ్‌లకు కీలకమైన సరఫరాదారు అయిన అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లో అత్యాధునిక ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈవీ, ఆటోమోటివ్ పరిశ్రమల్లో భారతదేశం యొక్క సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థ కోసం ఈ ప్రధాన మైలురాయిని ప్రకటించినందుకు మంత్రి అభినందించారు. వందేళ్ళ చరిత్ర కలిగిన అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్ లోని సెమీ కండక్టర్స్ ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోందన్నారు. వచ్చే ఐదు ఏళ్లలో 500 మందికి ఉపాధి కల్పించే లక్ష్యం అన్నారు. ఇండియాలో ఎన్నో ప్రధాన నగరాలను కాదని హైదరాబాదులో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ప్రభుత్వపరంగా వారికి అన్ని విధాలా పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఇక్కడున్న ఎకో సిస్టం, స్కిల్ వర్కర్ల అవైలబిలిటీ, గవర్నమెంట్ పాలసీస్ ఇవన్నీ వ్యాపారానికి చాలా అనుకూలంగా ఉన్నాయన్నారు. దేశంలో ఎలక్ట్రానిక్ రంగంలో సెమీ కండక్టర్ల వినియోగం విరివిగా పెరుగుతుందన్నారు. ఆటోమేటివ్ ,ఇండస్ట్రీస్ రంగాలలో సెమీ కండక్టర్ల వినియోగంపై గ్లోబల్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ చేస్తారని తెలిపారు. అలెగ్రో మైక్రో సిస్టమ్స్ మ్యాగ్నెటిక్ సెన్సార్, పవర్ ఐసి మ్యానుఫ్యాక్చరింగ్ లో గ్లోబల్ లీడర్స్ అని తెలిపారు. ఈ రంగానికి చెందిన అతిపెద్ద కంపెనీ తెలంగాణకు రావడం చాలా సంతోషమని తెలిపారు.

# కుల గణన సర్వే ఎవరికీ వ్యతిరేకం కాదు

ప్రజానావ, కొండపాక:

సోషల్ మీడియాలో సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సర్వేలో ఎలాంటి బ్యాంక్ వివరాలు అడగటం లేదని స్పష్టం చేశారు. 87వేల ఎన్యుమారెటర్‌లను పెట్టి సర్వే జరిపిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే వల్ల ఎలాంటి నష్టం జరగదని అన్నారు. కొండపాక మండలం దుద్దేడ గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...దేశానికి దిక్సూచిగా సర్వే నిలబడుతుందన్నారు. సర్వే కావాలని కోరిన వారే నేడు కనబడటం లేదని చెప్పారు. సర్వేను అడ్డుకున్న వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా అందరికీ గ్రంథాలయ వారోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి పాల్గొన్నారు.



# పండిన ప్రతి గింజను కొంటాం

ప్రజానావ, హైదరాబాద్:



రూ.2లక్షలకు పైబడిన వాళ్ళ రుణమాఫీ పై త్వరలోనే ప్రకటన చేస్తామని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుడ్ న్యూస్ చెప్పారు. రైతు భరోసా సబ్ కమిటీ నివేదిక రాగానే రైతులకు అందజేస్తామన్నారు. ఈ ఏడాది వరి సాగులో తెలంగాణ టాప్ స్థానంలో నిలిచిందన్నారు. ఒక కోటిన్నర లక్షల ఎకరాల దిగుబడితో పంజాబ్ రాష్ట్రాన్ని వెనక్కి నెట్టామన్నారు. గతంలో 41లక్షల ఎకరాలల్లో ఉన్న దొడ్డు ధాన్యం ఈ ఏడాది 21లక్షలకు పడిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సన్న ధాన్యం దిగుబడి పెరిగిందని, దేశ వ్యాప్తంగా సన్న ధాన్యానికి డిమాండ్ పెరిగిందన్నారు. 25 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో ఈ రోజు నాటికి 17 జిల్లాల్లో మాత్రమే జరిగాయన్నారు. 9.7 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా చేశారన్నారు. 6 వందల 25 కోట్లు ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు డబ్బులు అందించామన్నారు. బీజేపీ - బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతుల మనోధైర్యం దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. గతంతో పోల్చితే ఉత్పత్తి, కొనుగోళ్లు పెరిగాయన్నారు. అధికారం పోయినంత మాత్రాన ఇంతగనం ఆందోళన అవసరం లేదన్నారు. వాళ్ళ పార్టీలో ఆధిపత్యపోరు కోసం రైతులను ఇబ్బంది పెట్టకండి అని సూచించారు. రైతుల పై ఒత్తిడి లేదు.. ఓపెన్ మార్కెట్ లో అవకాశం ఉన్నా అమ్ముకోవచ్చన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ప్రతీ గింజా మేము కొంటామన్నారు. కేంద్రం గైడ్లైన్స్ లో మార్పులు చేయాలని కోరుతున్నామని తెలిపారు.

# కేసీఆర్‌ను కేటీఆర్ నిర్బంధించారు

ప్రజానావ, ఖైరతాబాద్:

పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై తాము చర్చకు సిద్ధమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పార్మా సిటీ ఒక్కచోట ఉండకూడదనే వికేంద్రీకరణ చేశామన్నారు. లగచర్లలో భూమిలేని వారు అధికారులపై దాడి చేశారని, కేటీఆర్ ఉద్దేశపూర్వకంగా దాడి జరిపించాడని ఆరోపించారు. ఫార్ములా వన్ రేసులో చేసిన తప్పేంటో కేటీఆర్‌కు తెలుసని, ఆయన తప్పు చేశాడని ఫీలవుతున్నాడు కాబట్టే జైలుకుపోతా అంటున్నాడని తెలిపారు. శుక్రవారం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ఫ్యామిలీని జైలుకు పంపడం లేదేంటని ప్రజలు అడుగుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి అధికారులపై పద్ధతి ప్రకారం చర్యలు ఉంటాయని వెల్లడించారు. ప్రతిపక్షహోదా ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏడాదిగా బయటకు రావడం లేదన్నారు. ఆయన ఎక్కడ దాకున్నారని ఆయన ప్రశ్నించారు. 'కేసీఆర్‌ను కేటీఆర్ నిర్బంధించారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ కంటే మేము 9 నెలల్లో ఎక్కువ చేశాం. నిర్బంధ పాలన నుంచి ప్రజా పాలన తీసుకొచ్చాం. అందుకే బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ప్రజలు కోరినట్లు పాలన సాగింది కాబట్టే విజయోత్సవాలు చేస్తున్నాం. బీఆర్ఎస్ హయాంలోని అవినీతి అధికారులపై చర్యలు ఉంటాయి. హైడ్రా అనేది హైదరాబాద్ నగరానికి ఒక వరం. ఆక్రమణలకు గురైన చెరువులు, కాలువలను పూర్తిగా బాగు చేస్తే.. వయనాడ్‌లో చోటుచేసుకున్న ఉపద్రవాలు ఇక్కడ వచ్చే అవకాశం ఉండదు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. మూసీ ప్రక్షాళన అవసరం. పేదలెవరూ నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం పునరావాస చర్యలు తీసుకుంటుంది' అని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

# ఏఐసీసీలో ఖర్గే ఓ బొమ్మ మాత్రమే..

ప్రజానావ, హైదరాబాద్:



శీతాకాల సమావేశంలో వక్ఫ్ బోర్డు బిల్లు పార్లమెంట్‌లో పాస్ అవుతుందని అన్నారు చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ముస్లిం సమాజానికి వ్యతిరేకం కాదని తెలిపారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో వక్ఫ్ మతం కిందకు రాదని చెబుతున్నాయని, వక్ఫ్ అనేది ఇతర దేశాల్లో ప్రభుత్వం కిందనే ఉందని తెలిపారు. ఎవరడ్డుకున్నా వక్ఫ్ బోర్డు సవరణ జరుగుతుందని చెప్పారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకమని.. ఎవరైనా సర్వోన్నత న్యాయస్థాన తీర్పును గౌరవించాల్సిందేనని అన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డును తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. దీనికి సుప్రీంకోర్టుకు మించి అధికారలిచ్చారని విమర్శించారు. ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ ప్రజలను పీడిస్తున్నాయని పేర్కొన్నారు. '300 వందల ఏళ్ల క్రితం కింద ఔరంగా జేబు నోటి మాటతో భూములిచ్చి ఉండొచ్చు, కానీ నేడు కుప్పలువుకుప్పలుగా డాక్యుమెంట్స్‌తో భూములు మావని అంటున్నారు. వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం, నవ్వాలో, ఏడ్వాలో, బాధపడాలో తెలియని పరిస్థితి. దేవాలయం అనేది మతానికి సంధించింది. వక్ఫ్ అనేది సమాజానికి సంబంధించినది. ముస్లిం ఓట్ల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ దేశాన్నైనా అమ్ముకుంటాయి. ఏఐసీసీలో ఖర్గే ఒక బొమ్మ మాత్రమే. నాడు మన్మోహన్ సింగ్‌ను ఎలా వాడుకున్నారో నేడు ఖర్గే కూడా అలాగే వాడుకుంటున్నారు.రాహుల్ తాత నెహ్రూ హాయంలో పాలేకర్ కమిషన్ ఏర్పాటు చేశారు. 1980 మండల్ కమిషన్ ఏర్పాటు చేశారు, ఎలాంటి చర్యలు లేవు. రాహుల్ తండ్రి రాజీవ్ గాంధీ విధానాలు నచ్చక అంబేద్కర్ కేబినెట్ వదిలేసి వెళ్లిపోయారు. రాజ్యాంగాన్ని బొంద పెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది' అని మండిపడ్డారు.

# సింపతీ కోసమే కేటీఆర్ అరెస్ట్ డ్రామా

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. రైతుల ముసుగులో కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నాయి. లగచర్ల ఘటనలో కేటీఆర్ ఉన్నట్టు వారి పార్టీ నాయకులే అంటున్నారు. కేటీఆర్ పదే పదే అరెస్ట్ అనడం కేవలం సానుభూతి కోసమే. ఆయనను అరెస్ట్ చేయడానికి మేమేమీ కుట్రలు చేయడం లేదు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. విచారణ పూర్తి అయ్యాక అన్ని విషయాలు బయటకు వస్తాయి. గత పదేళ్లలో రైతులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోంది. సన్న వడ్లు పండించిన ధాన్యానికి 500 బోనస్ ఇస్తున్నాం. ధాన్యం సేకరించిన వారం రోజులలోపే ఐదు వందల బోనస్ రైతులకు అందుతాయి. రైతుల విషయంలో ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారం ఆపాలి. ఇప్పటి వరకు 33కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేసేందుకు ప్రాసెస్ జరిగింది. 66 లక్షల ఎకరాల్లో 140 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయింది. కాళేశ్వరంతోనే నీళ్లు ఇచ్చాం అన్నారు.. మరి ఈ ధాన్యం ఉత్పత్తి కాళేశ్వరంతో కాలేదు కదా?. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేశారు. బీజేపీ తమ బాధ్యతలను విస్మరిస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రాలకు వెసులుబాటు కల్పించాలి. గత ప్రభుత్వ హయంలో గుట్టలకు, పుట్టలకు, చెట్లకు రైతుబంధు ఇచ్చారు. ఇలాంటి విధానాన్ని మేము కొనసాగించం.. నిజమైన రైతులకు న్యాయం చేస్తాం' అంటూ కామెంట్స్ చేశారు.




# 'పట్నం' కోసం రంగంలోకి బీఆర్ఎస్ లీగల్ టీమ్

ప్రజానావ, ఖైరతాబాద్:






బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్‌ను హైకోర్టు రిజిస్ట్రీ తిరస్కరించింది. ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాది హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం కోర్టుకు సెలవు కావడంతో హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి నేరస్తులతో కలిపి ఉంచారని పిటిషన్ వేశారు. స్పెషల్ బ్యారక్‌లో పట్నం నరేందర్‌ను ఉంచాలని న్యాయవాది కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు రిజిస్ట్రీ రిజక్ట్ చేసింది. లగచర్లలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపై దాడికి పాల్పడ్డ కేసులో నరేందర్‌రెడ్డిని వికారాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో ఆయనను పోలీసులు అదుపులో తీసుకున్నారు. అక్కడి నుంచి వికారాబాద్‌లోని పోలీస్ ఆఫీస్‌కు, తర్వాత జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. రిమాండ్ రిపోర్టులో ఆయనను ఏ1గా చేర్చారు. కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో తానే సురేష్‌తో దాడి చేయించానని, ఆర్థికంగా సహకరించారనని నరేందర్ రెడ్డి ఒప్పుకోవడంతో ఏ1గా ఆయనను చేర్చినట్లు, ఏ2గా సురేష్‌ను మార్చినట్లు పోలీసులు వెల్లడించారు. అంతకు ముందు వరకు సురేష్ పేరు ఏ1గా ఉండేది. బుధవారం సాయంత్రం కొండగల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట నరేందర్‌రెడ్డిని హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైలుకు తరలించారు. కాగా, కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో తన పాత్ర ఉందంటూ పోలీసులు కట్టు కథ అల్లారని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశాలతో రైతులను దాడులకు పురికొల్పినట్లుగా తాను నేరాంగీకార ప్రకటన ఇచ్చానని పోలీసులు చెబుతున్నట్లు తెలిసిందన్నారు. చర్లపల్లి జైల్లో ఉన్న నరేందర్‌రెడ్డి.. ఈ మేరకు గురువారం తన న్యాయవాదుల ద్వారా కొడంగల్ కోర్టును ఉద్దేశించి అఫిడవిట్ పంపించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న తనను పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బలవంతంగా వికారాబాద్ పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి నిర్బంధించినట్లు తెలిపారు.



# 3600 మంది రూ.300కోట్లు

**ప్రజానావ, రాయదుర్గం:**

వివిధ బైబ్యాక్ స్కీమ్స్, బంగారంపై పెట్టుబడులు పెట్టి భారీగా లబ్ధి పొందొచ్చని గాలమేశారు.. 3600 మంది నుంచి అందినంత దండుకుని రూ.300 కోట్లకుపైగా టోకరా వేసి మోసగించిన ముఠాలోని ఎనిమిది మందిని సైబరాబాద్ ఆర్థిక నేరాల పరిశోధన విభాగం(ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేశారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన కలిదిండి పవన్ కుమార్ ఎం/ఎస్ 12 వెల్త్ క్యాపిటల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ సంస్థ ప్రారంభించాడు. రావుల సత్యనారాయణ, బి.హరికృష్ణ, వల్లూరు భాస్కర్‌రెడ్డి, పగడాల రవి కుమార్‌రెడ్డి, కొల్లాటి జ్యోతి, కె.మౌనిక, కర్కుల లావణ్యలతో పవన్‌కుమార్ ఒక ముఠా ఏర్పాటుచేశాడు. బై బ్యాక్ ఓపెన్ ప్లాట్ స్కీమ్‌లో భాగంగా రూ.8లక్షల పెట్టుబడితో రెండు గుంటల జాగాను కొనుగోలు చేయడం ద్వారా నెలకు 4శాతం వడ్డీ పొందవచ్చని, 25నెలలపాటు రూ.32 వేలు పొందొచ్చని నమ్మించి అనేక మందిని చేర్పించారు.డబుల్ గోల్డ్ స్కీము పేరిట పెట్టుబడి పెడితే ఏడాది తర్వాత దానికి రెట్టింపు బంగారం అందజేస్తామని నమ్మిస్తారు. ఇందుకు బాండ్‌లు ఇస్తారు. గోల్డ్ చిట్స్ స్కీమ్ కింద రూ.5 లక్షలు పెట్టుబడి పెడితే నెలకు రూ. 15వేలు, గడువు ముగిశాక మొత్తం రూ.8 లక్షలు చెల్లిసామని పేర్కొంటారు. ఇలా 3600 మంది నుంచి రూ.300 కోట్లకుపైగా వసూలు చేశారు. కేపీహెచ్‌బీకి చెందిన హరికంట అనే బాధితుడు ఈఓడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించగా దర్యాప్తు చేపట్టి శుక్రవారం నిందితులను అరెస్టు చేశారు.

# భారత రాజ్యాంగం భగవద్గీత లాంటిది

**ప్రజానావ, నారాయణగూడ:**

ఓ గదిలోంచి యువతి ఆర్తనాదాలు వినిపించాయి.. అంతలోనే తుపాకి తూటాలు పేలిన శబ్దం.. ఏం జరిగిందా అని అంతా ఓ గది వైపు పరుగులు పెట్టారు.. ప్రజలు వెళ్లి చూస్తే.. ఓ యువతి రక్తం మడుగులో కనిపించింది.. ఇదంతా శుక్రవారం నారాయణగూడలోని కేశవ స్మారక న్యాయ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'లీగల్ ఎగ్జిబిషన్'లో ఆసక్తిని రేకెత్తించిన నమూనా. ఈ ప్రదర్శనను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవి దేవి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం భగవద్గీత లాంటిదన్నారు. విద్యాసంస్థల అధ్యక్షుడు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ వాణి తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**ధర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ ప్రారంభంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**ప్రజానావ, సిరిసిల్ల:**



గిరిజనులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా 150 జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ధర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన "గిరిజన సంక్షేమం,సంకల్పం నుంచి సత్వర ఆచరణ దిశగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు. దేశంలోని 63,843 గిరిజన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 79,156 కోట్లతో రానున్న ఐదేళ్లలో కనీస వసతులు కల్పించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అధికారులు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో గిరిజనుల ఆర్థిక అభివృద్ధి, వసతి, విద్యా, ఉపాధి కల్పన కోసం ఈ పథకాన్ని బిర్సా ముండా జయంతి సందర్భంగా ప్రారంభించిందని వెల్లడించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

**ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన**

ఖే లో ఇండియా జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో గిరిజన విద్యార్థిని మలావత్ సౌందర్య బంగారు పతకం సాధించడంతో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అధికారులు అభినందించి, రానున్న రోజుల్లో కూడా అన్ని పోటీల్లో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఇక్కడ డీ టీ డబ్ల్యూ ఓ జనార్ధన్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో గ్రూప్ –3 పరీక్షల సంధార్భంగా పటిష్టమైన బందోబస్త్

**జిల్లాలో గ్రూప్ –3 పరీక్ష కేంద్రాల దగ్గర సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (సెక్షన్ 144 ) అమలు**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**

**ప్రజానావ, సిరిసిల్ల:**



జిల్లా లో ఈ నెల 17, 18వ తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎస్పీ అఖిల్ మహజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గ్రూప్-3 రాత పరీక్షల సందర్భంగా జిల్లా పరిధిలోని సిరిసిల్ల,వేములవాడ,తంగాలపల్లి (25) కేంద్రాలలో 7062 మంది అభ్యర్థులు హాజరుకనున్నారని,పరీక్ష కేంద్రాల వద్ద జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేయడం జరుగుతుందని,పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్,ఇంటర్ నెట్ సెంటర్స్, మరియు చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు, మూసి వేయాలని, మరియు పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ కుండా పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

**గ్రూప్- 3 పరీక్ష రాసే అభ్యర్థులకు సూచనలు**

**పరీక్ష వేళలు:** ఉదయం 10:00 నుండి 12:30 గంటల వరకు మరియు మధ్యాహ్నం 3:00 గంటల నుండి 5:30 గంటల వరకు నిర్వహించబడుతుంది.

- అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి నిర్ణిత సమయాని కన్నా ముందే చేరుకోవాలి.
- ఉదయం 09:30 గంటలకు మరియు మధ్యాహ్నము 2:30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసి వేయబడుతాయి
- ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించరు.
- పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, సెల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచ్లు,క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు.
- అభ్యర్థులు తమ వెంట పరీక్ష హాల్ టికెట్, మరియు పెన్ మాత్రమే తీసుకురావాలి.
- పరీక్ష కేంద్రంలో మొబైల్ ఫోన్స్, ల్యాప్‌టాప్‌లు పెట్టుకోవడానికి ఎటువంటి క్లాక్ రూమ్ సదుపాయాలు ఉండవు.
- అభ్యర్థులు తమ హాల్ టికెట్ లో ఉన్న అన్ని సూచనలు తప్పకుండా చదువుకొని పాటించాలి.
- హాల్ టికెట్ తో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కార్డు వెంబడి ఉంచుకోవాలి,పరీక్షకు బయోమెట్రిక్ అటెండెన్స్ (ఆధార్ వేలి ముద్రలు) తప్పనిసరి.
- ప్రాథమిక పరీక్షకు బయోమెట్రిక్ వేలిముద్రల హాజరు నమోదు చేస్తారు. కాబట్టి మెహిందీ, టాటూలూ వేసుకొని పెట్టుకోవద్దు.
- విద్యార్థులకు పరిశుద్ధమైన నీరు, హాలుకు దగ్గర లో అందుబాటులో ఉంచబడును.
- పరీక్ష వేళలు ముగిసేవరకు అభ్యర్థులు హాల్ లోనే ఉండాలి.
- అభ్యర్థులు తమ రూమ్ నెంబర్,కేటాయించిన సీటు వద్దకు చేరుకొని ప్రశ్నాపత్ర కోడ్ ను పరిశీలించుకోవాలి.
- అభ్యర్థులు ఎగ్జామ్ విధి నిర్వాహణలో ఉన్నవారు తప్ప ఎవరినీ పరీక్ష మెయిన్ గేట్ దాటి లోపలికి అనుమతించబడరు.
- అభ్యర్థులందరినీ స్క్రీన్ చేసి క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించడం జరుగుతుంది.
- మొత్తం 7062 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు.

స్కూల్లో దగ్గర చుట్టుపక్కల పోలీసు వారు సూచించిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్కు చేసుకోవాలి.



# జర్నలిస్టుల రక్షణ చట్టం దేశవ్యాప్తంగా అమలు చేయాలి

**ఎన్‌యూజే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు పురుషోత్తం నరగౌని డిమాండ్**

**ప్రజానావ, వరంగల్:**

జర్నలిస్టుల రక్షణ చట్టం దేశవ్యాప్తంగా అమలు చేయాలి ఎన్‌యూజే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు పురుషోత్తం నారగౌని డిమాండ్ చేశారు. ఈ రోజు వరంగల్ జిల్లా తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ వరంగల్ జిల్లా జర్నలిస్టుల కమిటీ సమావేశం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీ పునర్వ్యవస్థీకరణ జరిగింది. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ ఉపాధ్యక్షుడు పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ, జర్నలిస్టుల రక్షణ కోసం జర్నలిస్టు రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు పరచాలని అన్నారు.. జర్నలిస్టులపై దాడులు, వేధింపులు, మరియు తప్పుడు కేసుల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చట్టం తీసుకురావాలని కోరారు.సమావేశంలో కండికొండ మోహన్ అధ్యక్షుడిగా, అవునూరి కుమారస్వామి జనరల్ సెక్రటరీగా, బత్తుల సత్యం ఖజాంచీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. సంక్షేమ పథకాలలో యూనియన్ల జోక్యం లేకుండా చూడాలి జర్నలిస్టుల సంక్షేమ పథకాలు నేరుగా అమలు చేయాలని, యూనియన్ల జోక్యం లేకుండా వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

2.చిన్న పత్రికలను తక్షణమే గుర్తించి, వాటిని ఎమ్పానెల్‌మెంట్‌లో చేర్చాలని కోరారు.

3.మీడియా రంగానికి ప్రత్యేక పాలసీ రూపొందించి, జర్నలిస్టుల భద్రత, పత్రికా స్వేచ్ఛకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు.

4. మీడియా ఉద్యోగుల సంక్షేమం


జర్నలిస్టుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన బీమా, పెన్షన్, మరియు ఇతర ఆర్థిక సహాయ కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు.

**జిల్లా కార్యవర్గం :**

అధ్యక్షుడిగా కందికొండ మోహన్,

ప్రధాన కార్యదర్శిగా అవునూరి కుమార్, కోశాధికారి బత్తుల సత్యం, ఉపాధ్యక్షులుగా లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, నగపూరి నాగరాజు, సహాయ కార్యదర్శులుగా ఈద శ్రీనాథ్, వల్లేపు భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పంచకం నర్సయ్య, అడుప అశోక్, నీరూటి శ్రీహరి, వలిశెట్టి మురళి, నాగపూరి అవినాష్, కార్యవర్గ సభ్యులుగా గోనె కమలాకర్, సుంకరి కళ్యాణ్, మంతెన సురేష్ లు ఎన్నికయ్యారు. అదేవిధంగా రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శిగా రావుల నరేష్‌ను ఎన్నుకోవటం జరిగింది.

# ఐ ఎంఏ మహిళా అధ్యక్షురాలిగా డా. లీలా శిరీష



**ప్రజానావ ప్రతినిధి, సిరిసిల్ల:**

సిరిసిల్ల జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు గా ప్రముఖ సీనియర్ గైనకాలజిస్ట్ డా.లీలా శిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రాబోవు రెండు సంవత్సరాలు ఈ పదవిలో ఉంటారు.తన ఎన్నికకు సహకరించిన తోటి వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు. పలువురు వైద్యులు డా.శిరీష కి శుభాకాంక్షలు తెలియ జేశారు.నూతన ఐ ఎం ఎ జిల్లా అధ్యక్షుడు డా.శ్రీనివాస్,కార్యదర్శి డా.అభినయ్, రాష్ట్ర అధ్యక్షుడు డా.కిషన్, జిల్లా వైద్యాధకారి డా.వసంతరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డా.పెంచలయ్య,జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డా.లక్ష్మి నారాయణ,ప్రముఖ వైద్యులు డా.సత్యనారాయణ స్వామి,డా.మనోహర్,డా.శంకర్,డా.ప్రసాదరావు,డా. రమణారావు,డా. రవీంద్ర,డా. తిరుపతి,డా.సంతోష్ మరియు మహిళా వైద్యులు డా. శోభారాణి, గీతావాణి,అరుణ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ లో ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

**ప్రజానావ, వేములవాడ:**



ఆలయంలో చేయాల్సిన పనుల పై పలు సూచనలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ లో ఈ నెల 20 వ తేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పర్యటన ఉన్న నేపథ్యంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలు వేములవాడ ఆలయంలో చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. సిఎం సందర్శించే చైర్మన్ గెస్ట్ హౌజ్ ,శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. సమావేశం జరిగే హల్ లో విద్యుత్ ఇబ్బందులు అదేవిధంగా మైక్ సౌండ్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించే ఎన్టీఆర్ అతిథి గృహంలో మార్పులు చేయాల్సిన అంశాల పై పలు సూచనలు చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి పర్యటన ఖరారైన నేపథ్యంలో స్వామి వారికి ప్రత్యేక చేసే ప్రాంతాలు తదితర వాటిపై సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలపై ప్రత్యేక బద్రత చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.. ముఖ్యమంత్రి పర్యటన ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూడాలని ఈవో అధికారులకు ఆదేశించారు సమయం తక్కువ ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆలయంలో సూచనలు చేసే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ,ఎస్పీ అఖిల్ మహాజన్ , ఆలయ ఈవో ఇతర అధికారులు ఉన్నారు..



# కొత్త బూత్ కమిటీలు నిర్వహించుకోవాలి

**○ బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్**

**ప్రజానావ, ఖైరతాబాద్:**

ఖైరతాబాద్ నియోజకవర్గం "జూబ్లీహిల్స్ డివిజన్ కార్యశాల" సాగర్ సొసైటీ ఆఫీసులో జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు "ముద్దంగుల శ్రీనివాస్" అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు "మెచినేని శ్రీనివాసరావు" మాట్లాడుతూ జూబ్లీహిల్స్ డివిజన్ లో సభ్యత్వ నమోదు పార్లమెంట్ లోనే అత్యధికంగా జరిగిందని చెప్పారు. ఇదే విధంగా కొత్తగా బూత్ కమిటీలు కూడా నిర్వహించుకోవాలని రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఏ ఎన్నికల్లో అయినా భారతీయ జనతా పార్టీ జెండా ఎగరేయడం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, కో కన్వీనర్ బలిజ రమేశ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా లీగల్ సెల్ కోకన్వీనర్ కస్తూరి మహిపాల్ రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు దండుగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా దళిత మోర్చా కార్యవర్గ సభ్యులు ఉపేంద్ర, డివిజన్ ఉపాధ్యక్షులు బోయ రామాంజనేయులు, మల్లేశ్ యాదవ్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు దొంగరి రాజకళ, లలిత, రమ్య, లక్ష్మ క్, మారెమ్మ, వసంత, రమదేవి, గురు బ్రహ్మ, సీతల అనిల్ కుమార్, వరికుప్పల మహేశ్, శ్రీనివాస్ చారి, కుబేరుడు, గిరి, బాలరాజు, , బీజేవైఎం నాయకులు మంజలి నరసింహా, ఆనంద్ సాగర్, ముద్దంగుల అంజి రాజు, రాము, మహేశ్, శ్రీకాంత్, రాజు తదితర ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట

**ప్రజానావ, సిరిసిల్ల:**

- **రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
- **జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 46 సీసీ కెమెరాలు ప్రారంభం**
- **సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు , ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి**



ఐడీఓసీ ఆవరణలో జిల్లా పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన 46 సీసీటీవీ కెమెరాలను వర్చువల్ ద్వారా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ,జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లతో కలసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. జిల్లాలో ప్రధాన రహదారులు ఆయన బోయినపల్లి నుండి జిల్లెల్ల వరకు,రుద్రంగి నుంచి వేములవాడ వరకు పైలెట్ ప్రాజెక్టుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. త్వరలో ఎల్లారెడ్డిపేట్ నుండి గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్ పోస్ట్ వరకు సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణనే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్రంలో పటిష్ట శాంతి భద్రతల కారణంగా రాష్ట్రానికి కొత్త పెట్టుబడులతో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో పాటు అనేక రంగాల్లో అభివృద్ధి గణనీయంగా జరుగుతుందని పేర్కొన్నారు.

జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు రావాలని,ఒక సీసీ కెమెరా 100 మంది పోలీస్ వారితో సమానమని, నేరాల నియాత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని మంత్రి తెలిపారు. జిల్లాలో నేరాల నియంత్రణ కోసం వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయడం జరిగిందని,కమాండ్ కంట్రోల్ ద్వారా జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చు అన్నారు. జిల్లాలో గ్రామాలలో పట్టణాలలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా, విజిబుల్ పోలీసింగ్,విలేజ్ పోలీస్ అధికారి వ్యవస్థ పకడ్బందీగా అమలు చేస్తున్న జిల్లా పోలీస్ యంత్రాగాన్ని మంత్రి గారు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**ప్రజానావ, తిమ్మాపూర్ :**

తిమ్మాపూర్ మండలం లోని రేణికుంట గ్రామంలో శ్రీ తిరుమలప్ప ఆలయంలో జరుగుతున్న వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో బాగంగ సత్యానారాయణ వ్రతం లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అనంతరం ప్రజలందరికీ కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు, అందరు భక్తి మార్గంలో నడవాలని ప్రజలందరూ పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు అనంతరం ఆలయ కమిటీ ఆద్వర్యంలో ఎమ్మెల్యే గారిని ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మరియూ ఆలయ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు సామూహిక వన బోజనాలు

**ప్రజానావ, తిమ్మాపూర్ :**

తిమ్మాపూర్ మండలం ఎల్ ఎం డి కాలనీ లో గల శ్రీ మృత్యుంజయ మహా దేవాలయంలో గోశాల సప్తమ వార్షికోత్సవాల్లో భాగంగా పురాణం మహేశ్వర శర్మ గారి ఆధ్వర్యంలో శనివారం రోజున ఉదయం 11గంటల నుండి గోమహా యగాలు, గోవ్రతములు,కార్తీక దామోదర పూజ, తులసీ కళ్యాణం జరుపబడునని అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట కు కార్తీక వనభోజనాలు కార్యక్రమం జరుపబడునని కార్యక్రమాలలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని గోమాత కృపకు పాత్రులు కావాలని శ్రీ మృత్యుంజయ మహా దేవాలయ ప్రధానకార్యదర్శి చల్ల మోహనరెడ్డి,ఆర్తికకార్యదర్శి సంగెం లక్ష్మణావు,ఉపాధ్యక్షులు గజ్వెల్లి బాలకిషన్ రావు మరియూ గిరిజ గోశాల ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

## విధి నిర్వహణలో రైలు ఢీకొని ఉద్యోగి మృతి

**ప్రజానావ, కమలాపూర్:**

ఓ రైల్వే ఉద్యోగి విధి నిర్వహణలో ట్రాక్‌ను తనిఖీ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ (ఇన్వెస్టిగేషన్ అధికారి) కె.భాస్కర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మలక్‌పల్లి గ్రామానికి చెందిన రంపీస శివకుమార్ (34) కరీంనగర్ జిల్లా జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో అసిస్టెంట్ టీఆర్‌డీ (ఎలక్ట్రికల్ విభాగం)గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్‌ను పరిశీలిస్తున్నారు. ఒక ట్రాక్‌పై వస్తున్న రైలును గమనించి, మరో ట్రాక్ వైపు వెళ్తుండగా అదే సమయంలో ఆ లైన్‌పై వచ్చిన రైలు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహానికి పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ కె.భాస్కర్ వెల్లడించారు. మృతుడికి భార్య, ఐదేళ్ల వయస్సున్న కుమారుడు ఉన్నారు.

# సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారం

**మంత్రి పొన్నం ప్రభాకర్ వార్నింగ్**

**ప్రజానావ, సిద్దిపేట:**



సోషల్ మీడియాలో సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సర్వేలో ఎలాంటి బ్యాంక్ వివరాలు అడగటం లేదని స్పష్టం చేశారు. 87వేల ఎన్యుమారెట్ లను పెట్టీ సర్వే జరిపిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే వల్ల ఎలాంటి నష్టం జరగదని అన్నారు. కొండపాక మండలం దుద్దేడ గ్రామంలో ఇవాళ (శుక్రవారం) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... దేశానికి దిక్సూచిగా సర్వే నిలబడుతుందన్నారు. సర్వే కావాలని కోరిన వారే నేడు కనబడటం లేదని చెప్పారు. సర్వేను అడ్డుకున్న వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా అందరికీ గ్రంథాలయ వారోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి పాల్గొన్నారు.

**నెహ్రూ జీవిత చరిత్రను చదవాలి**

"గ్రంథాలయాలు నిరుద్యోగ యువతకు చదువుకోవడానికి ఉపయోగపడేలా చేయాలి. ఈరోజు ఎంప్లాయ్‌మెంట్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల్లో 45 వేల ఉద్యోగాలు ఇచ్చింది. చదివిన జ్ఞానం జీవితంలో ఏదో చోట ఉపయోగపడుతుంది. ప్రపంచంలో ఏం జరుగుతుంది అనేది తెలుసుకునే వేదిక గ్రంథాలయం. సిద్దిపేట గ్రంథాలయం రాష్ట్ర గ్రంథాలయాలకు దీటుగా అభివృద్ధి చేస్తాం. నెహ్రూ ఐఐటీ, ఎయిమ్స్, విద్యాలయాలు, సాంకేతికత రంగంలో అభివృద్ధి చేయడం వల్లనే నేడు దేశం ముందుకు వెళ్తుంది. నెహ్రూ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలి. బ్రాంచ్ లైబ్రరీల సంఖ్య తక్కువగా ఉంది కావాల్సిన మెటీరియల్ అందించాలి" అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

**ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుంది.. కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులు రాద్ధాతం చేయకుండా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాకో సీనియర్ అధికారిని నియమించి ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తున్నామన్నారు. కాళేశ్వరం లేకున్నా కాళేశ్వరం ద్వారా పంటలు బాగా పండాయని బీఆర్ఎస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైస్ మిల్లర్ల విషయంలో ఎక్కడ ఇబ్బంది లేదని చెప్పారు. 20 మంది డిఫల్టర్‌లు ఉన్నారు.. ప్రభుత్వ బకాయిలు చెల్లించి మీరు కొనుగోలులో పాల్గొనాలని కోరారు. 101 మంది రైస్ మిల్లర్లు ఉన్నారు.. వారు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు..

## సంక్షేమ పథకాల అమలుకే ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే

**ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ టీపీసీసీ నాయకులు రాసూరి మల్లికార్జున్**

**ప్రజానావ, బెజ్జంకి:**




మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేపడుతోంది ప్రభుత్వ అధికారులు ఇంటింటి ఇంటికి వెళ్లి ప్రజా సంక్షేమం కోసం సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణ సర్వే చేస్తుందని దీని ద్వారా రానున్న రోజుల్లో రాష్ట్రంలో జనాభా ప్రకారం వాటాల ప్రకారం సామాజిక రాజకీయ ఆర్థిక విద్య ఉపాధి రంగాలలో జనాభా ప్రకారం న్యాయం జరగనుందని తద్వారా రానున్న రోజుల్లో ఈ సర్వే ఆధారంగా సంక్షేమ పథకాలు అందనున్నాయని కనుక మండలంలోని ప్రతి కుటుంభం ప్రత్యేకంగా సమయం కేటాయించి నిజమైన సమాచారం ఇవ్వాలని ఆర్టిఐ ప్రచార కమిటీ చైర్మన్ టి పి సి సి నాయకులు రాసూరి మల్లికార్జున్ కోరారు .గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో ఒకేరోజు రాష్ట్ర ప్రజలందరిని నిర్బంధం చేసి సకల జనుల సర్వే చేసి కేసిర్ వారి వ్యక్తిగత అవసరాలకే వాడుకున్నారని ఆర్టిఐ ప్రచార కమిటీ చైర్మన్ గా నేను సమాచారం కోరగా అప్పటి అధికారులు సకల జనుల సర్వే జరగలేదని ఇది ముద్రించలేదని ఇలాంటి సమాచారం మావద్ద లేదని కనుక మీరు కోరిన సమాచారం ఇవ్వలేమని సంబంధిత శాఖ లేఖ ద్వారా సమాధానం ఇచ్చారని గత ప్రభుత్వం ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి కులాలను లెక్క తీసుకొని వారి అవసరాలకు తగ్గట్టుగా వాడుకున్నారు తప్ప ప్రజలకి చేసిందేమీ లేదని అంతేకానీ అట్టి సర్వే వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఓటు బ్యాంకు రాజకీయాలకు కోసమే ప్రభుత్వ సొమ్ముతో సర్వే చేయించుకుని వాడుకున్నారని ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని రాష్ట్ర ప్రజలు దీనిని గమనించి కులగణనకు సహకరించాలని తద్వారా మీరు విధాల లబ్ది పొందాలని ఆర్టిఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ కోరారు



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ముత్యాల జగన్ రెడ్డి

**ప్రజానావ, గన్నేరువరం:**

గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామంలో జుట్టు సాయి, ఇటీవల అనారోగ్యంతో మరణించగా, శుక్రవారం మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను, పరామర్శించి, 50కేజీ, బియ్యం అందించారు. అధైర్య పడొద్దు.. తాను అండగా ఉంటాను అని సాయి కిరణ్ కుటుంబానికి భరోసా కల్పించారు .ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి పర్శరాము గౌడ్, బామాండ్ల రాజు, రాజిరెడ్డి, సంతోష్, జుట్టు రాకేష్, శివ, తదితరులు పాల్గొన్నారు...

## ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు పరామర్శ

**ప్రజానావ, కరీంనగర్:**



కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పరామర్శించారు. ఇటీవల గంగుల కమలాకర్ తల్లి నర్సమ్మ మృతి చెందింది. ఈ మేరకు కరీంనగర్ లోని గంగుల కమలాకర్ ఇంటికి రాజేందర్ రావు వెళ్లి ఆయనను పరామర్శించారు. నర్సమ్మ మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బుధవారం పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మామ మాధవరావు మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే విజయరమణారావును ఎలిగేడు మండలం శివపెల్లి లోని ఆయన నివాసంలో రాజేందర్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాధవరావు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కరీంనగర్ లోని 45వ డివిజన్ కార్పొరేటర్ పిట్టల వినోద అత్తమ్మ మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను రాజేందర్ రావు పరామర్శించారు. తీగలగుట్టపల్లికి చెందిన దాసరి నారాయణ తండ్రి వెంకట్రాజం మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను రాజేందర్ రావు పరామర్శించారు. వెంకట్రాజం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందులో కాంగ్రెస్ నేత తుమ్మనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పురుషుల పొదుపు సహకార సంఘం తరపున డబ్బులు అందజేత

**ప్రజానావ, తిమ్మాపూర్ :**



తిమ్మాపూర్ మండలంలోని ఇందిరానగర్ పురుషుల పొదుపు సహకార సంఘం సభ్యుడైన కీ.శే. బోయినీ శ్రీకాంత్ చనిపోవడంతో నామిని అయినా బోయిని ఎల్లమ్మ కు సమితి సంఘం నుండి వచ్చిన డబ్బులు రూ "82,544/రూపాయలను సమితి అధ్యక్షుడు పడాల శ్రీనివాస్,సంఘం అధ్యక్షుడు గంగిపల్లి సంపత్ లు అందజేశారు ఈ కార్యక్రమంలో పాలక వర్గం సభ్యులు రామకిషన్, బోయినీ తిరుపతి,శంకరయ్య,లక్ష్మయ్య,సదానందం,కనుకయ్య,రాజశేఖర్, వెంకటేష్, మరియూ ఘనకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు





### ఆలయాలకు కార్తీక శోభ..

కార్తీక పౌర్ణమి సందర్బంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఉదయం నుంచే దేవాలయాల్లో దర్శనానికి జనం బారులు తీరారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలోని శివాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు ఉదయం నుంచే ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అలయ చైర్మెన్ గద్దల సుజాత - ప్రభాకర్ తెలిపారు. భక్తుల తాకిడి తో శివాలయంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది.. - ప్రజానావ, కొత్తపల్లి







# ఘనంగా కార్తీక పౌర్ణమి

**ప్రజానావ, మెదక్:**
కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రం కోదండ రామాయలయంలో ఆలయ ప్రధాన అర్చకులు భాష్యం మధుసూదనాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీపోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బండ నరేందర్, కమిటీ సభ్యులు, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.









## వైభవంగా కార్తీక పౌర్ణమి

**ప్రజానావ, కీసర :**
నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామ పురోహితులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని భవానీ రామలింగేశ్వర స్వామి అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం దశ సహస్ర (10,000) దీపార్చన నిర్వహించారు. కార్తీక పౌర్ణమి కావడంతో తెల్లవారుజాము నుండి భక్తులు అధిక సంఖ్యలో చేసి స్వామివారి దర్శించుకొని ప్రత్యేక అభిషేక నిర్వహించి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సరితారమేష్, నాగేష్‌గౌడ్, కళావతి యాదగిరి, లక్ష్మీవేణు, కో ఆప్షన్ సభ్యులు అశోక్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## రెండు ఉద్యోగాలు సాధించిన
# అర్షానా బేగం





**ప్రజానావ, శామీర్‌పేట:**
మూడుచింతలపల్లి మండలం అనంతారం గ్రామానికి చెందిన మొహమ్మద్ ఆజం కూతురు మొహమ్మద్ అర్షానా బేగం టీజీపీఎస్సీ నిర్వహించిన పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం పొంది శిక్షణ కూడా ఈ నెల 21తో ముగుస్తుంది. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గ్రూప్ 4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. తన కూతురు రెండు ఉద్యోగాలు సాధించడం పట్ల మొహమ్మద్ ఆజం సంతోషం వ్యక్తం చేశాడు.

## కొండపోచమ్మను దర్శించుకున్న
# కాంగ్రెస్ యూత్ నాయకులు

**ప్రజానావ, జగదేవ్‌పూర్:**
జగదేవపూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గల కార్తిక పౌర్ణమి సందర్భంగా కొండపోచమ్మ ఆలయాన్ని కాంగ్రెస్ యూత్ నాయకులు గుర్రం అశోక్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కలు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో
# వ్యక్తి మృతి
### మరొకరికి తీవ్రగాయాలు

**ప్రజానావ, చిన్న శంకరంపేట:**
చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామ శివారులో రెండు బైకులు ఢీకొనడంతో సూరారం గ్రామానికి చెందిన గజం కిషన్ చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రమేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఇరువురిని 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిషన్ మృతి చెందడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాద చాయాలు అలముకున్నాయి. కిషన్ గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండేవాడని ఒక మంచి వ్యక్తిని కోల్పోవడం జరిగిందని, కిషన్ మృతి చెందడం చాలా బాధాకరమని, మృతుడి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ చిలుక నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డిలు పరామర్శించారు.

## 'కోటి దీపోత్సవం' వేడుకకు
# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**ప్రజానావ, ఖైరతాబాద్:**
భక్తి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కోటి దీపోత్సవం' వేడుకలు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవంబర్ 9న ఆరంభమైన ఈ దీపాల పండుగ దిగ్విజయంగా కొనసాగుతోంది. హైదరాబాద్ సహా రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కోటి దీపోత్సవ వేడుకకు చేరుకున్నారు. కాగా.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న రేవంత్.. ఉజ్జయిని మహాకాళేశ్వరుడికి హారతి సమర్పించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు తిరువణ్ణామలై శ్రీ అరుణాచలేశ్వర స్వామి కల్యాణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం వేదికపై స్వర్ణలింగానికి రజత బిల్వార్చన, అష్టోత్తరశత స్వర్ణపుష్పార్చన జరిపారు. దీంతో పాటు పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ (అవధూత దత్తపీఠం, మైసూరు) అనుగ్రహ భాషణం చేశారు. మహాసహస్రావధాని బ్రహ్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు ప్రవచనామృతం వినిపించారు. భక్తులచే మహాకాళేశ్వరునికి కోటి పుష్పార్చన చేయించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# కొబ్బరి బొబ్బట్లు ఇలా తయారుచేసుకోండి?

కొబ్బరి బొబ్బట్లు పేరు చెబితేనే నోరూరిపోతుంది. ఒక్కసారి వాటిని తిని చూడండి. జీవితంలో మర్చిపోలేరు. దీపావళికి కొబ్బరి బొబ్బట్లు చేసే లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పిస్తే అమ్మవారి అనుగ్రహం కూడా దుక్కుతుంది. తెలుగువారికి బొబ్బట్లతో ఉన్న బంధం అంతా ఇంతా కాదు. ఎప్పుడూ శనగపప్పు తో చేసే బొబ్బట్లనే కాదు ఓసారి కొబ్బరి బొబ్బట్లు ప్రయత్నించండి. వేడివేడి కొబ్బరి బొబ్బట్టుపై నెయ్యి వేసుకొని తింటే రుచి అదిరిపోతుంది. దీపావళి రోజు లక్ష్మీదేవికి నైవేద్యంగా స్వీట్ ను పెడతారు. ఆ స్వీట్ ని కూడా కొబ్బరి బొబ్బట్లు రూపంలో పెట్టవచ్చు. బొబ్బట్లును పూరాన్ పోలి అని పిలుస్తారు. ఈ కొబ్బరి బొబ్బట్లు చేయడం చాలా సులువు. ఎక్కువగా ఉత్తర భారత దేశంలో కొబ్బరి బొబ్బట్లు చేస్తూ ఉంటారు. వీటిని ఎలా చేయాలో తెలుసుకోండి.

**కొబ్బరి బొబ్బట్లు రెసిపీకి కావాల్సిన పదార్థాలు**

మైదా లేదా గోధుమపిండి – ఒక కప్పు
బెల్లం తురుము – ఒక కప్పు
తురిమిన తాజా కొబ్బరి – ఒక కప్పు
నెయ్యి – మూడు స్పూన్లు
ఉప్పు – చిటికెడు
యాలకుల పొడి – అర స్పూను
నూనె – రెండు స్పూన్లు
నీళ్లు – సరిపడినన్ని
పసుపు – పావు స్పూను



**తయారీ విధానం..**

ఒక గిన్నెలో మైదా లేదా గోధుమ పిండిని తీసుకోండి. కొంతమంది బొబ్బట్లు మైదాతో చేస్తే మరికొందరు గోధుమపిండితో చేస్తారు. ఏది ఎంచుకోవాలన్నది మీ ఇష్టమే. ఇప్పుడు ఆ గోధుమ పిండిలో చిటికెడు ఉప్పు, పసుపు వేసి నీళ్లు కలుపుతూ చపాతీ పిండిలాగా కలుపుకోండి.

ఒక పావుగంట సేపు పైన మూత పెట్టి పక్కన పెట్టేయండి. ఇప్పుడు కొబ్బరిని తురిమి పక్కన పెట్టుకోండి. స్టవ్ మీద గిన్నె పెట్టి బెల్లం వేసి నీళ్లు వేయండి. ఆ బెల్లం కరిగే వరకు ఉంచండి. బెల్లంలో ఉండే మలినాలు పైకి తేలిపోతాయి. వాటిని వడకట్టి పక్కన పెట్టుకోండి. ఆ బెల్లం మిశ్రమంలో ముందుగా తురిమిన కొబ్బరి, యాలకుల పొడి వేసి బాగా కలపండి. ఆ మిశ్రమాన్ని మళ్లీ స్టవ్ మీద పెట్టి ఉడికించుకోండి. కొబ్బరి దగ్గరగా హల్వాలాగా అయ్యేంతవరకు గరిటెతో కలుపుతూనే ఉండండి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి.ఈ కొబ్బరి బెల్లం మిశ్రమం చల్లారే వరకు ఉంచండి. అది చల్లారాక చిన్న చపాతీ ముద్దను తీసుకొని పూరీలాగా ఒత్తి మధ్యలో ఈ కొబ్బరి మిశ్రమాన్ని పెట్టి మడత పెట్టండి. తిరిగి దాన్ని గుండ్రంగా ఒత్తండి. స్టవ్ మీద పెనం పెట్టి కాస్త నెయ్యి లేదా నూనె వేసి ఈ బొబ్బట్టు రెండు వైపులా కాల్చండి. అంతే టేస్టీ కొబ్బరి బొబ్బట్టు రెడీ అయినట్టే. ఇలా అన్నింటినీ చేసి లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పించండి.

ఆ తర్వాత ప్రసాదంగా స్వీకరించండి. దీని రుచి ఇంటిల్లిపాదికి నచ్చుతుంది. వీటిని చేయడం పెద్దగా



# టీ, బిస్కట్ ఈ కాంబో డేంజర్

టీ, బిస్కట్ కాంబో టేస్ట్ అదిరిపోతుంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి ఈ అలవాటు ఉంటుంది. ఉదయమే కాదు.. సాయంత్రం వేళ కూడా టీలో బిస్కెట్లు నానబెట్టుకుని తింటుంటారు. కానీ రోజూ ఇలా రోజూ చేస్తే మీకు లేనిపోని అనారోగ్య సమస్యలు వస్తాయి తెలుసా? ఎందుకంటే చాయ్ లో, బిస్కట్లలో చక్కెర , చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మిమ్మల్ని ఎన్నో జబ్బుల పాలు చేస్తాయి.

**బిస్కట్లలో చక్కెర ఎక్కువ**

మనం తినే చాలా బిస్కట్లలో శుద్ధి చేసిన చక్కెర ఉంటుంది. టీ తాగుతూ వాటిని టీలో ముంచి తాగితే మీ రక్తంలో చక్కెర స్థాయిలు బాగా పెరుగుతాయి.ఈ కాంబినేషన్ మీకు టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. అంతేకాదు దీనివల్ల మీరు విపరీతంగా బరువు కూడా పెరుగుతారు. అలాగే మీ ఒంట్లో శక్తి తగ్గుతుంది. రక్తంలో షుగర్ లెవెల్స్ అకస్మాత్తుగా పెరగడం వల్ల అలసట కలుగుతుంది. దీంతో మీకు కాసేపటి తర్వాత మళ్లీ చక్కెర తినాలనిపిస్తుంది.

**కేలరీలు**

బిస్కెట్లు మైదా, చక్కెరతోనే తయారవుతాయి. వీటిలో ఎలాంటి పోషకాలు ఉండవు. వీటిని తింటే బరువు పెరుగుతారు. అలాగే మీ శరీరంలోకి అదనపు కేలరీలు చేరుతాయి.ఈ బిస్కట్లు మీ ఆకలిని తీర్చవు.

ముఖ్యంగా మరింత ఎక్కువ తినాలనిపించేలా చేస్తాయి. దీనివల్ల మీరు విపరీతంగా బరువు పెరగడమే కాదు.. దానికి సంబంధించిన ఎన్నో అనారోగ్య సమస్యలు కూడా వస్తాయి.

**ట్రాన్స్ ఫ్యాట్స్, చెడు నూనెలు**

మనం తినే చాలా రకాల బిస్కట్లలో ట్రాన్స్ ఫ్యాట్స్, హైడ్రోజనేటెడ్ నూనెలుంటాయి. ఇవి మన గుండెను ప్రమాదంలో పడేస్తాయి. ఇవి మన శరీరంలో మంచి కొలెస్ట్రాల్ ను తగ్గించి, చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ ను పెంచుతాయి.

దీంతో మనకు గుండె జబ్బులు, స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. చెడు కొలెస్ట్రాల్ ఉన్న బిస్కట్లను తక్కువగా తిన్నా.. ఎక్కువగా తింటే మాత్రం గుండె జబ్బులు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**టీ, బిస్కట్ ఆరోగ్య ప్రమాదాలు**

అసిడిటీ, జీర్ణ సమస్యలు టీ లో టానిన్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి మీ కడుపులో ఆమ్లత పెంచుతాయి. శుద్ధి చేసిన మైదా పిండి, చక్కెర, ఎక్కువగా ఉన్న కార్బోహైడ్రేట్ బిస్కట్లను టీలో నానబెట్టి తింటే అసిడిటీ, గ్యాస్, అజీర్తి వంటి జీర్ణ సమస్యలు మరింత ఎక్కువ అవుతాయి. కార్బోహైడ్రేట్లు, చక్కెర ఎక్కువగా ఉన్న బిస్కట్లను ఎప్పుడూ తినే వారికి కడుపులో ఆమ్లాలు అసమతుల్యమవుతాయి. అలాగే జీర్ణక్రియ దెబ్బతింటుంది. కడుపు నొప్పి వస్తుంది. .

బిస్కట్లలో చక్కెరలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. వీటిని శరీరం త్వరగా గ్రహించి, రక్తంలో చక్కెరను పెంచుతాయి. దీనివల్ల మీకు బాగా అలసట కలుగుతుంది. బలహీనంగా, చిరాగ్గా అనిపిస్తుంది. అలాగే మళ్లీ చక్కెర తినాలనిపిస్తుంది. ఇది చెడు ఆహారపు అలవాట్లకు దారితీస్తుంది.

**నోటి ఆరోగ్య సమస్యలు**

బిస్కట్లు జిగటగా ఉంటాయి. కాబట్టి వీటిని తింటే పళ్లకు అంటుకుంటాయి. టీ లో ఉండే చక్కెరతో కలిసి, పళ్లు పుచ్చిపోవడం, ఇతర దంత సమస్యలు వస్తాయి. టీ, బిస్కట్లలోని చక్కెరలు మననోటి బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతుంది. దీంతో ప్లేక్, కుహరాలు, చిగుళ్ల వ్యాధులు వస్తాయి. టీ, బిస్కెట్ల కాంబినేషన్ తరచుగా తీసుకుంటే మీకు ఖచ్చితంగా దంత సమస్యలు వస్తాయి. కాబట్టి, టీ, బిస్కట్లు తరచుగా తినడం మానుకోండి.



## పొద్దున్నే అలారం పెట్టుకుంటున్నారా..

# వెరీ డేంజర్



అలారం పెట్టుకుని నిద్రలేచే వారికి ఇది షాకింగ్ విషయమే. ఎవరైతే అలారం పెట్టుకుని ఉదయాన్నే ఆ శబ్దానికి ఉలిక్కిపడి లేస్తారో.. వారంతా అతి త్వరలో అధిక రక్తపోటు బారిన పడతారట. ఈ విషయాన్ని యూవీఏ స్కూల్ ఆఫ్ నర్సింగ్ లో ప్రచురించారు. ఒక అధ్యయనంలో అలారం వల్ల అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఉన్నట్టు తేలింది. ఈ అధ్యయనంలో అలారం శబ్దంతో మేల్కొనే వారిలో రక్తపోటు 74 శాతం పెరిగినట్టు అధ్యయనకర్తలు చెబుతున్నారు. రాత్రి పూట ఏడుగంటల కన్నా తక్కువ సమయం నిద్రపోయిన వారిలో బీపీ పెరుగుదల కూడా ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తెలిసింది. బీపీ పెరిగిందంటే మీ గుండెకు రక్షణ కరువైనట్టే. గుండెపోటు, స్ట్రోక్ వంటి ప్రమాదాలు పెరిగిపోతాయి. కచ్చితంగా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. అలారం మిమ్మల్ని గాఢ నిద్ర నుండి అకస్మాత్తుగా మేల్కొలుపుతుంది. దీనివల్ల 'నిద్రా జడత్వం' ఏర్పడుతుంది. ఒక రెండు గంటల పాటు మీరు గజిబిజిగా ఉంటారు. ఆ సమయంలో ఒత్తిడి స్థాయిలు కూడా అధికంగా ఉంటాయి. దీని వల్లే రక్తపోటు కూడా పెరుగుతుంది. రక్తనాళాల్లో రక్తం అత్యంత వేగంగా ప్రవహిస్తూ ఉంటుంది. అది రక్తనాళాల గోడలను గుద్దుకుంటూ ప్రవహిస్తుంది.

దీనివల్ల రక్తపోటు పెరుగుతూ ఉంటుంది. కాబట్టి మీకు వీలైనంత వరకు అలారం అలవాటును మానుకోవాలి. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, ఒకే సమయానికి లేవడం అలవాటు చేసుకుంటే మీకు అలారం అవసరమే ఉండదు. చీకటి గదిలో నిద్రపతే ఎప్పుడు తెల్లవారిందో తెలుసుకోవడం కష్టమే. అలాంటి వారే ఎక్కువగా అలారాన్ని వాడతారు. అలా కాకుండా సహజంగా కాంతి మీ గదిలోకి వచ్చేటట్టు చూసుకోండి. దీనివల్ల తెల్లవానగాపూ ఆ కాంతి మీ శరీరాన్ని చేరుతుంది. మీ మెదడులో స్లీప్ హార్మోన్ అయినా మెలటోనిన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీనివల్ల మీరు సహజంగానే మేల్కొంటారు. ప్రతిరోజూ రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటలకు తగ్గకుండా నిద్రపోయే వారిలో అలారం పెట్టాల్సిన అవసరం లేదని తేలింది. అలాగే ఎవరైతే ఒకే నిద్రా సమయాలను పాటిస్తారో వారికి కూడా అలారం అవసరం లేదు.

కాబట్టి మీ నిద్ర షెడ్యూల్‌ను క్రమబద్ధం చేసుకోండి... అంటే ప్రతి రాత్రి ఒకే సమయానికి నిద్రపోవడం, ప్రతిరోజ ఉదయం ఒకే సమయానికి నిద్ర లేవడం అలవాటు చేసుకుంటే కేవలం రెండు వారాల్లోనే మీ నిద్ర షెడ్యూల్ ఫిక్స్ అయిపోతుంది. అప్పుడు మీకు అలారం అవసరం పడదు. ఒకవేళ అలారం తప్పనిసరిగా పెట్టుకోవాల్సి వస్తే పెద్ద శబ్దాలు, మాస్ పాటలు పెట్టుకోకుండా శ్రావ్యమైన సంగీతాన్ని పెట్టుకోండి. అది కూడా శబ్దం తక్కువ స్థాయి నుండి ఎక్కువ స్థాయికి ప్రయాణించే విధంగా ఉన్న శబ్దాన్ని పెట్టుకుంటే ఉత్తమం. మొదటే పెద్ద శబ్దంతో అలారం మోగితే మీరు ఉలిక్కిపడి లేస్తారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. అలారం నుంచి వచ్చే పెద్ద శబ్దం వల్ల సౌండ్ స్లీప్ అకస్మాత్తుగా అంతరాయం కలుగుతుంది. ఇది మీలో భయాందోళనలను పెంచుతుంది. కార్టిసాల్ స్థాయిలను పెంచుతుంది. కార్టిసాల్ అనేది ఒత్తిడి హార్మోను. ఇది ఎప్పుడైతే ఉదయాన్నే పెరుగుతుందో మీకు ఆ రోజంతా చిరాకుగా, ఆత్రుతగా, కోపంగా ఉంటుంది. ఉదయాన ప్రశాంతంగా లేచిన వారే ఆ రోజంతా ప్రశాంతంగా పనులు చేయగలుగుతారు. ప్రతిరోజూ రాత్రి 10 గంటలకు నిద్రపోయి, ఉదయం ఆరు గంటలకి నిద్ర లేవడం అలవాటు చేసుకోండి. ఇది ఎంతో ఉత్తమ నిద్రా సమయాలు. ఆ రాత్రి నిద్ర కూడా మీ శరీరానికి సరిపోతుంది. మానసికంగా, శారీరకంగా మీరు ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. ఇది మీలో ఒత్తిడిని, హృదయ స్పందన రేటును అదుపులో ఉంచుతుంది. ప్రశాంతమైన వాతావరణంలో మీరు ఉదయం నిద్ర లేవడం వల్ల ఆనందంగా జీవించగలుగుతారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# అదరగొట్టిన టీమిండియా

## 135 పరుగుల తేడాతో భారీ విజయం.. సిరీస్ కైవసం




**జొహానెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో టీ20లో భారత్ 135 పరుగుల తేడాతో అద్వితీయ విజయం సాధించింది. దీంతో 31 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌లో చేలరేగిన భారత్.. తిలక్ వర్మ (120*: 47 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్స్‌లు), సంజు శాంసన్ (109*: 56 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) శతకాలతో దండెత్తడంతో వికెట్ కోల్పోయి 283 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సఫారీలు 18.2 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌట్ అయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3, వరుణ్ చక్రవర్తి 2, అక్షర్ పటేల్ 2, హార్దిక్ పాండ్య, రవి బిష్ణోయ్, రమణ్‌దీప్ ఒక్కో వికెట్ తీశారు.

**తుపాను ఇన్నింగ్స్ ఆడిన బ్యాటర్లు..**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టింది. తొలి ఓవర్‌లో నాలుగు పరుగులే వచ్చాయి. రెండో ఓవర్ నుంచి రెచ్చి పోయిన సంజు ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగాడు. అగ్నికి వాయువు తోడైనట్లుగా అప్పటివరకు నిదానంగా ఆడిన అభిషేక్ శర్మ (36: 18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఐదో ఓవర్‌లో చెలరేగి పోయాడు. వరుసగా రెండు సిక్స్‌లు, ఒక ఫోర్, చివరి బంతికి మళ్లీ సిక్స్ కొట్టి ఒక్కసారిగా ఊపులోకి వచ్చాడు. అయితే తర్వాతి ఓవర్‌లో సిపమ్లాకు క్యాచ్ ఇచ్చి అభిషేక్ వెనుదిరిగాడు. దీంతో మూడు ఓవర్ల పాటు స్కోర్ కాస్త నెమ్మదించింది. తొలుత ఆచితూచి ఆడిన తిలక్.. తొమ్మిదో ఓవర్‌లో గేర్ మార్చాడు. కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో వరుసగా రెండో సిక్స్‌లు బాది తన ఉద్దేశాన్ని చాటాడు.

10వ ఓవర్లో శాంసన్ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టగా, తిలక్ రెండు ఫోర్లు బాదాడు. దీంతో మ్యాచ్ మరో లెవెల్‌కు దూసుకెళ్లింది. ఓ వైపు సంజు.. మరో ఎండ్‌లో తిలక్ వర్మ ఇద్దరూ దక్షిణాఫ్రికా బౌలర్లను ఆడుకున్నారు. వారి బౌలింగ్‌ను ఊచకోత కోశారు. వీరి వీరబాదుడుకు 10 ఓవర్లకు 129/1తో ఉన్న భారత్ స్కోర్.. 15 ఓవర్లకు 219/1గా మారింది. కేవలం 5 ఓవర్లలో 90 పరుగులు పిండుకున్నారు. దీనికి తోడు ఇద్దరూ సెంచరీకి చేరువయ్యారు. అనంతరం అదే జోరు కొనసాగించిన సంజూ 51 బంతుల్లో, తిలక్ వర్మ 41 బంతుల్లోనే సెంచరీలు చేశారు.



# రషీద్ డబుల్ సెంచరీ

**ప్రజానావ, హైదరాబాద్:** ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రా టీమ్ కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 301 పరుగులకు ఆలౌటైంది. జవాబుగా మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆంధ్రా శుక్రవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 143 ఓవర్లలో 9 వికెట్లకు 448 పరుగులు చేసింది. దీంతో ఆంధ్రాకు ఇప్పటి వరకు 147 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. షేక్ రషీద్ అద్భుత డబుల్ సెంచరీతో ఆంధ్రాను ఆదుకున్నాడు. చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన రషీద్ 372 బంతుల్లో 28 ఫోర్లతో 203 పరుగులు చేశాడు. అతనికి కరణ్ షిండే (109) అండగా నిలిచాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 236 పరుగులు జోడించారు.


# వేలం బరిలో 574 మంది క్రికెటర్లు

**బ్రిస్బేన్:** పాకిస్థాన్‌తో గురువారం జరిగిన తొలి టి20లో ఆస్ట్రేలియా 29 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను ఏడు ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 7 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగి పోయాడు. దూకుడుగా ఆడిన మ్యాక్స్‌వెల్ 19 బంతుల్లోనే ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు. స్టోయినిస్ 7 బంతుల్లో అజేయంగా 21 పరుగులు సాధించాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 64 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఆరంభం నుంచే ఆస్ట్రేలియా బౌలర్లు అద్భుతంగా రాణించారు. వరుస క్రమంలో వికెట్లను తీస్తూ ఏ దశలోనూ పాకిస్థాన్‌కు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. హసీబుల్లా (12), అబ్బాస్ అఫ్రిది 20 (నాటౌట్), షహీన్ అఫ్రిది (11) మాత్రమే రెండంకెల స్కోరును అదుకున్నారు. మిగతా వారు విఫలం కావడంతో పాక్‌కు ఓటమి తప్పలేదు.

చెంప చెళ్లుమనిపించిన

# టైసన్

**న్యూఢిల్లీ:** దాదాపు 20 ఏళ్ల తర్వాత ప్రొఫెషనల్ బౌట్ కోసం సిద్ధమవుతున్న దిగ్గజ బాక్సర్ మైక్ టైసన్‌కు కోపమొచ్చింది. తన ప్రత్యర్థిగా రింగ్‌లో దిగబోతున్న జేక్ పాల్ చెంపను అతను చెళ్లుమనిపించాడు. భారత కాలమానం ప్రకారం ఈ ఇద్దరి మధ్య పోరు శనివారం ఉదయం 6.30 గంటలకు ఆరంభమవుతుంది. దీనికి ముందు ఇద్దరు బాక్సర్ల బరువును కొలిచేందుకు ఓ కార్యక్రమం నిర్వహించారు. ఇందులోనే 27 ఏళ్ల పాల్‌ను 58 ఏళ్ల టైసన్ కొట్టాడు. వెంటనే భద్రత సిబ్బంది స్పందించి వీళ్లను ఆపారు. అయితే బరువు కొలిచే సమయంలో తన పాదంపై పాల్ కాలు పెట్టడంతోనే టైసన్ కొట్టాడని తెలిసింది. ఈ విషయాన్ని అక్కడే ఉన్న టైసన్ స్నేహితుడు టామ్ పాటి వెల్లడించాడు. ఈ ఘటన తర్వాత మాటలు ముగిశాయని అంటూ టైసన్ ఆగ్రహంగా వెళ్లిపోయాడు. "నాకేం బాధ లేదు. అతను కోపంతో ఉన్నాడు. అందంగా కొట్టావ్ మిత్రమా" అని పాల్ పేర్కొన్నాడు. ఆ తర్వాత అతను మరణించాలని అరుస్తూ పాల్ నిష్క్రమించాడు. 2005లో కెవిన్ చేతిలో ఓటమి తర్వాత టైసన్ ప్రొఫెషనల్ బాక్సింగ్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ బౌట్‌లో తలపడటం కోసం టైసన్ సుమారు రూ.168 కోట్లు, పాల్ దాదాపు రూ.337 కోట్లు పొందనున్నట్లు తెలిసింది.




# హెచ్ సీఏ టీ20 లీగ్ విజేత ఉమ్మడి జిల్లా జట్టు

**జట్టుకి అభినందనలు తెలిపిన హెచ్ సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు**

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏ డివిజన్ టి20 లీగ్ టోర్నమెంట్లో ఉమ్మడి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 7వ తారీఖున ప్రారంభమైన ఈ లీగ్ లో మొత్తం 22 జట్లు పాల్గొనగా, ఇందులో తుది మ్యాచ్ కి మారేడ్పల్లి కల్ట్స్ మరియు ఉమ్మడి జిల్లాల జట్టు అర్హత పొందగా, నేడు జింఖానా మైదానం వేదికగా జరిగిన తుది మ్యాచ్లో ఉమ్మడి జిల్లాల జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టును హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు అరిశనపల్లి జగన్మోహన్ రావు, హెచ్ సి ఏ కార్యవర్గ సభ్యులు, కరీంనగర్, వరంగల్, మహబూబ్ నగర్ జిల్లాల సెక్రెటరీలు ఆగం రావు, శ్రీనివాస్, రాజశేఖర్, సీనియర్ క్లబ్ స్లెక్రటరీ రవి కుమార్ లు అభినందించారు.ఇలాగే మున్ముందు జరగబోయే అన్ని మ్యాచులో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే తాము ఎల్లప్పుడూ ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తామని, వారికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.




ఇందులో భాగంగానే ప్రతి జిల్లాకి హైదరాబాద్లోని జింఖానా వేదికగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ అకాడమీ తరహాలోనే ఏర్పాటు చేయబోతున్నామని, మున్ముందు జిల్లాలలో క్రీడా వసతులు మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.

# రాహుల్ మోచేతికి దెబ్బ

పెర్త్: ఆస్ట్రేలియాతో ప్రతిష్టాత్మక బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ ఆరంభానికి ఇంకో వారం రోజులే సమయం ఉండగా.. ఈ సిరీస్ తొలి మ్యాచ్‌లో ఓపెనింగ్ చేస్తాడని భావిస్తున్న టీమ్‌ఇండియా సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మోచేతికి దెబ్బ తగిలింది. ప్రాక్టీస్‌లో భాగంగా జట్టులోని ఆటగాళ్లతో జరిగిన అంతర్గత మ్యాచ్‌లో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ బంతి రాహుల్ మోచేతికి బలంగా తాకింది. ఈ మ్యాచ్‌లో 29 పరుగులు చేసిన రాహుల్..

దెబ్బ తగలగానే బ్యాటింగ్ ఆపేశాడు. జట్టు ఫిజియో అతడికి చికిత్స అందించాక స్కాన్ కోసం పంపించారు. స్కాన్ నివేదిక రావాల్సి ఉంది. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లికి సైతం స్కాన్ తీసినట్లుగా ఆస్ట్రేలియా పత్రిక సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్‌లో వార్త రావడం అభిమానుల్లో ఆందోళన రేకెత్తించింది. గాయమేంటో వెల్లడి కాలేదు. కానీ కోహ్లి



విషయంలో ఆందోళనేమీ లేదని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

# పిసిబికి ఐసిసి షాక్

**దుబాయి:** పాకిస్థాన్ ఆక్రమిత్ కశ్మీర్‌లో పాక్ క్రికెట్ బోర్డు (పిసిబి) నిర్వహించ తలపెట్టిన ఛాంపియన్స్ ట్రోఫీ టూర్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) చెక్ పట్టింది. వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. ఈ టోర్నీకి సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను ఐసిసి ఇంకా ప్రకటించలేదు. అయితే ట్రోఫీ టూర్‌కు మాత్రం అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా కప్పును తొలుత పాకిస్థాన్‌కు పంపించింది. దీంతో పాక్ క్రికెట్ బోర్డు ట్రోఫీ టూర్ షెడ్యూల్‌ను ప్రకటించింది. నవంబర్ 16న పాక్ రాజధాని ఇస్లామాబాద్ నుంచి ఈ ట్రోఫీ టూర్ ప్రారంభం కానుంది. కానీ పాక్ బోర్డు మాత్రం పిఓకె పరిధిలో ఉన్న స్కర్దు, హుంజా, ముజఫరాబాద్ ప్రాంతాలను కూడా షెడ్యూల్ జాబితాలో చేర్చింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) ఈ విషయాన్ని ఐసిసి దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై స్పందించిన ఐసిసి పిఓకెలో ట్రోఫీ టూర్‌పై నిషేధం విధించింది. దీంతో పాక్ క్రికెట్ బోర్డు షాక్‌కు గురైంది. పిఓకెలో ట్రోఫీ టూర్‌కు అనుమతించే ప్రసక్తే లేదని ఐసిసి స్పష్టం చేసింది. దీంతో చేసేదేమీ లేక పిసిబి వెనక్కి తగ్గక తప్పలేదు. ఇదిలావుంటే వచ్చే ఏడాది జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ భద్రత కారణాల వల్ల పాక్‌లో మ్యాచ్‌లు ఆడేందుకు బిసిసిఐ అంగీకరించడం లేదు.




ఇదే విషయాన్ని పిసిబి, ఐసిసి దృష్టికి తీసుకెళ్లింది. హైబ్రిడ్ పద్ధతిలో టోర్నీని నిర్వహించాలని బిసిసిఐ కోరింది. భారత్ ఆడే మ్యాచ్‌లతో పాటు నాకౌట్ పోటీలను పాక్ కాకుండా వేరే దేశంలో జరిగేలా చూడాలని బిసిసిఐ కోరుతోంది. దీనికి ఐసిసి సానుకూలంగానే స్పందించింది. అయితే పాక్ బోర్డు హైబ్రిడ్ పద్ధతిలో టోర్నీని నిర్వహించేందుకు ఒప్పుకోవడం లేదు. అన్ని మ్యాచ్‌లు తమ దేశంలోనే నిర్వహిస్తామని ఐసిసికి స్పష్టం చేసింది. దీంతో పాక్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగడం ప్రశ్నార్థకంగా మారింది.



# మరోసారి తండ్రయిన రోహిత్ శర్మ

**ముంబై:** టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తండ్రయ్యాడు. అతని సతీమణి రితికా సజ్దే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. రోహిత్ శర్మ రితికా దంపతులకు ఇప్పటికే సమైరా అనే కుమార్తె ఉంది. రితికాను రోహిత్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఇరుకుటుంబాల పెద్దల ఆశీర్వాదంతో 2015, డిసెంబర్ 13న వీరి వివాహం జరిగింది. ఈ అందాల జంటకు 2018 డిసెంబరు 30న సమైరా జన్మించింది. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు ఇప్పటికే అక్కడికి చేరుకుంది. కానీ, రోహిత్ శర్మ మాత్రం భారత్‌లోనే ఉండిపోయాడు. తన భార్య రెండో కాన్పు నేపథ్యంలోనే అతడు ఆస్ట్రేలియాకు వెళ్లలేదని వార్తలొచ్చాయి. ప్రస్తుతం రితికా పండంటి బిడ్డకు జన్మనివ్వడంతో రోహిత్.. ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు ముందే కంగారుల గడ్డపై అడుగుపెట్టే అవకాశముంది.



# రాజ్యం లేకుండా యుద్ధం చేసిన రాజు 'డాకు

'డాకు మహారాజ్'గా సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని బాబీ తెరకెక్కిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. బాబీ దేవోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'డాకు మహారాజ్' పేరును ఖరారు చేస్తూ.. చిత్ర బృందం శుక్రవారం హైదరాబాద్‌లో టైటిల్ టీజర్‌ను విడుదల చేసింది. ''ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఒక రాజుది. గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మ రాజుది. మరణాన్ని వణికించిన మహారాజుది'' అంటూ టీజర్‌లో బాలయ్య పాత్రను పరిచయం చేసిన తీరు ఆకట్టుకునేలా సాగింది. టీజర్ విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు బాబీ మాట్లాడుతూ.. ''టీజర్‌లో చూసిన దాంట్లో డూపులు లేవు. గుర్రం ఎక్కింది బాలకృష్ణనే. యుద్ధం చేసింది ఆయనే. ఇది పూర్తిగా మాస్ సినిమా. మరో స్థాయిలో ఉంటుంది. ఇందులో కొత్త బాలయ్యను చూస్తారు. తమన్ మ్యూజిక్ చూస్తే.. స్పీకర్స్ ఓనర్స్ నా మీద, తన మీద కేసులు వేస్తారేమో అనిపిస్తుంది. బాలకృష్ణ మాపై నమ్మకంతో ఈ చిత్రం చేశారు. కచ్చితంగా ఈ యుద్ధం గట్టిగా ఉండబోతుంది'' అన్నారు. ''థియేటర్లలో ఈ సినిమా అభిమానులకు అసలు సిసలైన పండుగలా ఉంటుంది'' అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఈ చిత్రం జనవరి 12న రానుంది.

## రష్మిక మందన్న ఫేవరెట్ సాంగ్స్ ఆ రెండే..


నేషనల్ క్రష్ రష్మిక మందన్నా 'పుష్ప'సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. దీంతో ప్రజెంట్ భాషతో సంబంధం లేకుండా.. వరుస సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతుంది. ఈ బ్యూటీ ప్రజెంట్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రాలు 'కుబేర, 'పుష్ప 2'. ఇందులో పుష్ప2 డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ సుకుమార్కాంబోలో తెరకెక్కిన ఈ చిత్రం రిలీజ్ సమయం దగ్గరపడటంతో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటూ సందడి చేస్తున్నారు చిత్ర బృందం. ఈ క్రమంలోనే తాజాగా తెలుగు ఇండియన్ ఐడల్ ఫోగ్రమ్‌కు హాజరైన రష్మిక తన ఫేవరేట్ సాంగ్స్ గురించి చెప్పుకొచ్చింది. ఆమె మాట్లాడుతూ.. 'నా లైఫ్‌లో నా కెరీర్‌లో నా టూ ఫేవరెట్ సాంగ్స్ 'కదలల్లే, శ్రీవల్లి'' అని చెప్పుకొచ్చింది. కాగా.. 'పుష్ప' సినిమాలో శ్రీవల్లి సాంగ్ ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇప్పటికీ కూడా ఈ సాంగ్ సోషల్ మీడియాలో టాప్ 10 లో ఒకటిగా వైరల్ అవుతోంది.





## కృతి సనన్ బోల్డ్ వీడియో వైరల్.. షాక్‌లో నెటిజన్లు

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు 'హీరోపంతి'సినిమాతో ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన కృతి తన నటనతో ఫుల్ తెచ్చుకుని స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. ఇక తెలుగులో 'నేనొక్కడినే' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మైమరిపించింది. అలాగే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్సరసన 'ఆదిపురుష్'లో సీతగా నటించింది. కానీ హిట్ అందుకోలేకపోయింది. దీంతో బాలీవుడ్ చెక్కేసి అక్కడే వరుస సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది.ఇటీవల 'దో పత్తీ'మూవీతో హిట్ అందుకుంది. ప్రజెంట్ ఈ అమ్మడు మూవీస్ చేస్తూనే.. మరోవైపు యాడ్స్‌లోనూ నటిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ పలు హాట్ ఫొటోలు షేర్ చేస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, కృతి సనన్‌కు సంబంధించిన ఓ బోల్డ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో ఆమె ఏదో కూల్ డ్రింక్ తాగుతుండగా.. ఓ వ్యక్తి ఆమె కాలుని పట్టుకుంటాడు. దీంతో ఆమె వెరైటీ ఎక్స్‌ప్రెషన్ ఇస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో చూసిన నెటిజన్లు షాక్ అవుతూ పలు రకాల కామెంట్లు పెడుతున్నారు.



## 'నాగిన్' కోసం శ్రద్ధ సిద్ధం

'స్త్రీ 2'తో బ్లాక్ బస్టర్ హిట్‌ను సొంతం చేసుకుంది కథానాయిక శ్రద్ధాకపూర్. అమర్ కౌశిక్ తెరకెక్కించిన ఈ చిత్రంలో దెయ్యం పాత్రలో సినీప్రియుల్ని భయపెడుతూ పరుగులు పెట్టించిన ఈ బాలీవుడ్ సోయగం.. తన రాబోయే ప్రాజెక్టు కోసం నాగకన్య అవతారమెత్తింది. ఆమె ప్రధాన పాత్రలో 'నాగిన్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. విశాల్ ఫ్యూరియా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రకటించి నాలుగేళ్లు గడుస్తున్నా.. అనివార్య కారణాల వల్ల ఇప్పటికీ చిత్రీకరణకు నోచుకోలేదు. తాజాగా నిర్మాత నిఖిల్ ద్వివేది ఈ ప్రాజెక్టు గురించి ఓ తీపి కబురు వినిపించారు. వచ్చే ఏడాది షూటింగ్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారాయన. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత మాట్లాడుతూ.. ''ఎట్టకేలకు స్క్రిప్ట్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. 'నాగిన్' కథను సిద్ధం చేయడానికి మాకు మూడేళ్లు పట్టింది. నేను ఈ సినిమా చేయడానికి కారణం.. భారతీయ జానపద కథలు చాలా ప్రత్యేకమైనవి. సినిమాల్లో సాలీడు మనిషిని కరిస్తే అతను స్పైడర్‌మ్యాన్‌గా మారితే మనందరం చాలా సంతోషిస్తాం. కానీ ఒక స్త్రీ పాముగా మారడాన్ని తక్కువ చేసి చూస్తారు. ఇప్పుడీ కథనే మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్తగా తెరపై పరిచయం చేయబోతున్నాం. ఇందులో నాగిన్ పాత్రలో శ్రద్ధా కపూర్ మాత్రమే నటించగలదు. ఆమె కూడా షూటింగ్‌ను మొదలుపెట్టడానికి చాలా ఉత్సాహంగా ఉంద''ని అన్నారు. నాగిని పాత్రలో మెప్పించిన శ్రీదేవిని చూసినప్పుడల్లా తనకూ అలా నటించాలని ఉందని పలు సందర్భాల్లో చెప్పిన శ్రద్ధ మరి ఈ సినిమాలో ఎలా మెప్పిస్తుందో చూడాలి.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657